క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న సెకండ్ ఎస్సై షాఖాన్


రేగొండ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి సెకండ్ ఎస్సై షాఖాన్ మంగళవారం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన నాగరాజు పరకాలకు వెళ్తుండగా ఫోన్ ఎక్కడో పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా .. పోలీసులు వివరాలు నమోదు చేసి సెల్‌ఫోన్ గుర్తించి బాధితునికి అందించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, ఈ పోర్టల్ ద్వారా ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని సెకండ్ ఎస్సై సూచించారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నాయకులు



భూపాలపల్లి రూరల్: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును హైదరాబాద్‌లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావులతో కలిసి పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరం రవీందర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పెరిక కులస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు.

పరామర్శ



టేకుమట్ల: మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు కాసర్ల అరవిందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దుగ్యాల రాంచందర్‌రావు, దేశెట్టి సునీల్, తదితరులు ఉన్నారు.

గద్దర్‌కు పద్మశ్రీ ఇవ్వం అనడం అవివేకం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

టేకుమట్ల: ప్రజా యుద్ధనౌక, ప్రజాకవి, ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన యోధుడు గద్దర్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ పద్మశ్రీ అవార్డు ఇవ్వం అని మాట్లాడడం అవివేకం అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పద్మశ్రీ అవార్డు గద్దర్‌కు చిన్నదే అని అన్నారు. ఎంతో మంది పీడిత ప్రజల హక్కుల కోసం ఉద్యమించి, చావుకు సైతం ఎదురొడి పోరాడిన యోధుడు గద్దర్ అన్నారు. అలాంటి వ్యక్తి పోలీసులను, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను చంపాడని అతడికి పద్మశ్రీ అవార్డు ఇవ్వమంటూ కేంద్ర మంత్రి మాట్లాడిన తీరు యావత్ తెలంగాణ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మట్టి అక్రమ తరలింపు ఆపాలి

చిట్యాల: మండలంలోని శాంతినగర్ గుట్టల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని సీపీఎం లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం బుచ్చయ్య మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హేమకు వినతిపత్రం అందజేశారు. గుట్టలను నుంచి అక్రమంగా మట్టిని తరలించకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

మొగుళ్లపల్లి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుడిపహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుడిపహాడ్ గ్రామానికి చెందిన పాశం సదయ్య(40) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో పాటు ఇంట్లో ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడం వల్ల భార్య తాగుడు విషయంలో మందలించింది. దీంతో గొడవలను మనుసులో పెట్టుకుని సోమవారం పనికి వెళుతున్నాని ఇంట్లో చెప్పి పనికి వెళ్లకుండా మద్యం మత్తులో బంగ్లపల్లి శివారులోని మొక్కజొన్న చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, మంగళవారం ఉదయం మృతి చెందిన విషయం గమనించారు. ఈ మేరకు భార్య పాశం సునీత ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నిలిచిన వంతెన నిర్మాణం



గాలికి కూలిన వంతెన గడ్డర్లు



మానేరులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు

సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కాని అంతర్‌జిల్లా వంతెన

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, కాంట్రాక్టర్

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి-కలికోట శివారు మానేరు వాగుపై రూ.50 కోట్ల నిధులతో నిర్మిస్తున్న అంతర్ జిల్లా వంతెనను 2015 ఆగస్టులో ప్రారంభించారు. వంతెన నిర్మాణం ఆధునిక టెక్నాలజీతో జరిగిన పనులు నత్తనడకన సాగాయి. వంతెన నిర్మాణం పూర్తి అయితే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజలకు రవాణా దూర భారం తగ్గి జిల్లా ప్రజలకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. కానీ కాంట్రాక్టర్, పాలకుల నిర్లక్ష్యం మూలంగా వంతెన నిర్మాణం నిలిచిపోయింది. అలాగే నాణ్యత పాటించకపోవడంతో వంతెన గడ్డర్లు కూలిపోయాని పలువురు ఆరోపిస్తున్నారు.

తప్పని తిప్పలు..

ప్రస్తుతం మానేరు వాగులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన తాత్కాలిక రోడ్డు ప్రయాణికులకు ఊరటనిస్తుంది. ప్రతీ ఎండాకాలంలో తాత్కాలిక రోడ్డుపై ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తున్నారు. కానీ వర్షాకాలం మొదలు కావడంతో కథ మొదటికొస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానేరు వాగు అవతలి గ్రామాలైన పెద్దపల్లి జిల్లా, ముత్తారం మండలంలోని ఓడేడ్, అడవిశ్రీరాంపూర్, వంటి గ్రామాల రైతుల వ్యవసాయ భూములు ఎక్కువగా టేకుమట్ల మండలంలోని కలికోట శివారులో ఉండడంతో ప్రతి రోజు రైతులు వాగు దాటి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఓడేడ్ గౌడ కార్మికులకు తాటి వనం మొత్తం కలికోట శివారులో ఉండడంతో నిత్యం వాగుదాటి రావాలి ్సింది. ఇక వర్షాకాలంలో మానేరులో నీటి ప్రవాహం ఎక్కువైందంటే రైతులు, గౌడ కార్మికుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి.

తగ్గనున్న దూరభారం..

వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న సింగరేణి కార్మికులు వర్షకాలంలో మానేరులో నీళ్లు రావడం మూలంగా భూపాలపల్లి, కాటారం మీదుగా సుమారు 150 కిలోమీటర్ల దూరరం అదనంగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మండలం నుంచి కాల్వ శ్రీరాంపూర్ మీదుగా పెద్దపల్లికి చేరుకునే ప్రయాణికులు కూడా అధిక దూరం ప్రయాణించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తి అయితే 150 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సిన వారు కేవలం 50 కిలో మీటర్ల దూరంలో గోదావరిఖని, పెద్దపల్లి జిల్లాలకు చేరుకునే సౌకర్యం ఉంటుందని పలువురు అంటున్నారు.

కేంద్ర బిందువు కానున్న టేకుమట్ల..

మానేరుపై వంతెన నిర్మాణం పూర్తి అయితే కరీంనగర్, పరకాల, గోదావరిఖని, హనుమకొండ పట్టణాలకు టేకుమట్ల కేంద్ర బిందువుగా మారనుంది. వంతెన నిర్మాణం పూర్తి అయితే మినీ పట్టణంగా రూపు దిద్దుకుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కావున ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి వంతెన నిర్మాణ పనులను సత్వరంగా పూర్తి చేసేలా కృషి చేయాలని కోరుతున్నారు.

వంతెన సాధన సమితి ఏర్పాటు..

ఓడేడ్-గర్మిళ్లపల్లి వెంతన నిర్మాణాన్ని పునఃప్రారంభించేందుకు అధికారుల, పాలకులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఇటీవల బీఎస్పీ, సీపీఐ ఎంఎల్, ఎమ్మార్పీఎస్, ఏవైఎస్ నాయకులు సమష్టిగా ఏర్పడి వంతెన సాధన సమితి ఏర్పాటు చేసుకున్నారు. త్వరలో కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రస్తుత కాంట్రాక్టర్‌కు కాకుండా రూ.20కోట్ల నిధులను అదనంగా కేటాయించి మరో కాంట్రాక్టర్‌కు నిర్మాణ వంతెన పనులను అప్పగించినట్లు విస్వసనీయ సమాచారం.

వంతెనపై పట్టింపు లేదు..



ఓడేడ్-గర్మిళ్లపల్లి మానేరు వంతెన నిర్మాణంపై అధికారులకు, పాలకులకు పట్టింపు లేదు. దీంతో నిర్మాణం నిలిచిపోయింది. వంతెన నిర్మాణం కోసం ఇటీవల వంతెన సాధన సమితి కమిటీని సైతం ఏర్పాటు చేసుకున్నాం. వంతెన నిర్మాణంపై అధికారులు, పాలకులు ఇలాగే నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేస్తాం.

– పొన్నం భిక్షపతిగౌడ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు

రవాణా పెరుగుతుంది..



వంతెన నిర్మాణం పూర్తి అయితే మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి వంటి నగరాల నుంచి కరీంనగర్, జమ్మికుంట, పరకాల, వరంగల్‌లకు రవాణా సౌకర్యం పెరిగి ప్రయాణికులకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. అధికారులు, నాయకులు స్పందించి త్వరగా వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

– దాసారపు శ్రీనివాస్, గర్మిళ్లపల్లి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఏఎమ్మార్ ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్‌రెడ్డి



యోగా చేస్తున్న కార్మికులు

మల్హర్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకురుతుందని ఏఎమ్మార్ ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు మానసిక, భావోద్వేగ శ్రేయస్సును ప్రోత్సహించే లక్ష్యంతో మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు క్యాంపు ఆవరణలో యోగా శిబిరాన్ని మంగళవారం ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్ రెడ్డి, వెంకటరమణ హార్ట్‌ఫుల్నెస్, టీచర్, హైదరాబాద్ వాలంటీర్ల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు యోగా ధ్యాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగాను ప్రోత్సహించడానికి ఏఎమ్మార్ సంస్థ చొరవ తీసుకోవడం అనందంగ ఉందన్నారు. ఈ ధ్యాన శిబిరాన్ని అనుభవజ్ఞులైన బోధకులు నిర్వహిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్, సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, ఎస్ఓ సురేష్‌బాబు, డీజీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- సిరికొండ ప్రశాంత్



క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ప్రశాంత్

భూపాలపల్లి అర్బన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని క్రీడా స్వాగత్ సమితి అధ్యక్షుడు సిరికొండ ప్రశాంత్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. అంబేడ్కర్ స్టేడియంలో భూపాలపల్లి, గణపురం పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఈ క్రీడా పోటీలను సిరికొండ ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని క్రీడలు శారీరక మానసిక ధృఢత్వానికి దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఇన్‌చార్జ్ అధికారి రాఘు, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి రమేశ్, ఏబీవీపీ నాయకులు హర్షవర్ధన్, రాజుకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- పుల్ల మల్లయ్య



నినాదాలు చేస్తున్న నాయకులు

చిట్యాల: రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ వాది పాముకుంట్ల తిరుపతయ్య, ఏవైఎస్ జిల్లా, మండల నాయకులు గుర్రపు రాజేందర్, యుగేందర్, సరిగోమ్ముల రాజేందర్, దొడ్డె శంకర్, పుల్ల ప్రతాప్, పాముకుంట్ల చందర్, చింతల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి కూలీలను తరలించవద్దు

- ఎస్సై శ్రావణ్‌కుమార్



కూలీలతో మాట్లాడుతున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: గూడ్స్ వాహనాల్లో పరిమితికి మించి రైతు కూలీలను తరలించవద్దని డ్రైవర్లకు ఎస్సై శ్రావన్‌కుమార్ సూచించారు. మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో తిరిగి రోడ్డు భద్రతా నియామాలపై ప్రజలకు వివరించారు. అలాగే మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గూడ్స్ వాహనంలో పరిమితికి మించి రైతు కూలీలు వెళ్లడం గమనించి వాహనాన్ని నిలిపివేసి గతంలో రైతు కూలీలకు జరిగిన ప్రమాదాలపై వారికి వివరించారు. రైతు కూలీలు ప్యాసింజర్ వాహనంలో మాత్రమే వెళ్లాలని అన్నారు. వాహనంలో అధిక సంఖ్యలో కూలీలను తరలించడం వలన వాహనం అదుపు తప్పితే ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఏఎస్సై మధుసూదన్, సిబ్బంది సందీప్, సురేష్, నాగరాజు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు కోసం ఉద్యమం తప్పదు

- బీజేపీ మండల అధ్యక్షుడు రంజిత్



మాట్లాడుతున్న రంజిత్

కాటారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయకుంటే ఉద్యమం తప్పదని బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభిస్తున్నామని గొప్పలు చెప్పుకొచ్చిన సీఎం, మంత్రులు ఇప్పుడు ఇస్తాం, అప్పుడు ఇస్తాం అని కుంటిసాకులు చెపుతూ ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. కాలయాపన చేయకుండా పథకాల అమలు చేపట్టాలన్నారు. మండలంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హులైన లబ్ధిదారులకు పథకాలను అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన ద్వారా రాష్ట్రంలో మంజూరైన ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్లు అని పేరు పెడితే ఊరుకునేది లేదన్నారు. ఇందిరమ్మ కమిటీ పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకు ఇళ్లు కేటాయిస్తే ప్రజలు తిరగబడుతారని హెచ్చరించారు. గ్రామ పంచాయితీ ఎన్నికల లబ్ధికోసమే సంక్షేమ పథకాలను మార్చి వరకు పొడిగిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ దుర్గం తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, నాయకులు ఆత్మకూరి స్వామియాదవ్, బొంతల రవి, ఐలి తిరుపతి, గుండా మల్లారెడ్డి, ఇంజమూరి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులపై ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం'



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ములుగు రూరల్: మల్లంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులపై ప్రిన్సిపాల్ అంకయ్య నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ మండల ప్రధాన కార్యదర్శి ధీకొండ భరత్ అన్నారు. మంగళవారం గురుకుల విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వెళ్లి గ్రామంలో తిరుగుతుండగా తీసుకువెళ్లి పాఠశాలలో అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ప్రిన్సిపాల్ విధులుకు హాజరు కాలేదని ఇన్‌చార్జ్ ఉపాధ్యాయుడిని విద్యార్థులు బయటకు వెళ్లి విషయంపై ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెపుతున్నారని అన్నారు. విద్యార్థులపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల పట్టింపులేనితనంతో భవిష్యత్ కోల్పోతున్నారని అన్నారు. పాఠశాలలో మౌళిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేసే వరకు ఆందోళనలు

వెంకటాపురం(కె): తమకు న్యాయం చేసే వరకు ఆందోళనలను నిర్వహించనున్నట్లు జాతీయ మాల మహానాడు జిల్లా కన్వీనర్ తోట మల్ల రమణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్ ఆవరణలో మంగళవారం మాల మహానాడు ఆత్మీయ సన్నాహక సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్ల రమణమూర్తి హాజరై మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తున్నామని తెలిపారు. ఎన్ని జన్మలెత్తినా ఏబీసీడీ వర్గీకరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. మాలలు ఏకమై పోరాడాలని పిలుపు నిచ్చారు. తోటమల్ల రమణమూర్తి జాతీయ మాల మహానాడు కన్వీనర్‌గా ఎన్నికైన సందర్భంగా శాలువాతో ఆయనను మండల కమిటీ సభ్యులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భూషణం, సుందర్ రావు, శ్రీను, కిరణ్, మోహన్, ఆదినారాయణ, గణపతి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు

- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కంకర పోసి వదిలేసిన పాపయ్యపల్లి-దుంపెల్లిగూడెం రోడ్డు

గోవిందరావుపేట: దుంపెల్లిగూడెం నుంచి పాపయ్యపల్లికి వెళ్లే దారి బురదమయంగా మారుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. దీంతో రెండు సంవత్సరాల క్రితం బీటీ రోడ్డు మంజూరు చేశారు. నాలుగు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డును పూర్తి చేస్తే మండల కేంద్రానికి పోవడానికి చుట్టు ఉన్న 10 గ్రామాలకు రాకపోకలు సులువుగా మారుతాయి. కాగా, పనులు మంజూరు అయిన వెంటనే కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేశారు. దీంతో ప్రజలకు బురద కష్టాలు పోయి కంకర కష్టాలు వచ్చాయి. బురదతో వర్షకాలంలో మాత్రమే ఇబ్బంది పడేవాళ్లమని ప్రస్తుతం ప్రతీ రోజు కంకర రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పనులు అసంపూర్తిగా నిలిచి పోయిన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కంకర పోసి వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కంకర పోసి రెండు సంవత్సరాలు దగ్గరికి వస్తున్న ఇంత వరకు బీటీ నిర్మించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం..

కాంట్రాక్టర్ రోడ్డు పనులు మొదలు పెట్టి రెండు సంవత్సరాలు అవుతోంది. కంకర పోసి వదిలేశాడు. బీటీ పోసి పనులు పూర్తి చేయాలని ఇప్పటికే రెండు సార్లు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశా. త్వరలోనే పనులు పూర్తయ్యేలా చూస్తాం.

– వీరభద్రం, ఈఈ, ఐటీడీఏ

పథకాల అమలుపై ప్రజల హర్షం

ములుగు రూరల్: ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా అమలు చేయడంతో గ్రామస్తులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని బండారుపల్లి పంచాయితీపరిధి జీవింతరావుపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉండి రైతులను, నిరుపేదలను పట్టించుకున్న పాపానపోలేదని అన్నారు. కనీసం రేషన్ కార్డులను పంపిణీ చేయలేక పోయారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఎర్పడిన సంవత్సర కాలంలో మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కు గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అంగోత్ వంశీక్రిష్ణ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు దేవిపింగ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

పాఠశాల భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

రేగొండ: నూతన మండలం కొత్తపల్లిగోరిలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఏర్పాటు కోసం మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవనాలను ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఏర్పాటుకు అనుగుణంగా మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, కారోబార్ నాగరాజు పాల్గొన్నారు.

'ఆలయ సిబ్బంది అమర్యాద ప్రవర్తన'

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో తనపై సిబ్బంది, అర్చకులు అమర్యాదగా ప్రవర్తించారని శైలజ అనే మహిళ భక్తురాలు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. తాను మహదేవపూర్ మండలంలో హెల్త్‌డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నట్లు తెలిపారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకోవడానికి దేవస్థానంలోని క్యూలైన్ ద్వారా కాకుండా, ఎదురుగా ఉన్న గ్రిల్స్ మార్గం ద్వారా లోపలికి వెళ్లడానికి ప్రయత్నించడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది, అర్చకులు అమర్యాదతో మాటలు అంటు బయటికి వెళ్లాలని అరిచినట్లు తెలిపారు. వెంటనే తిరిగి క్యూలైన్‌లో దర్శనానికి వెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా, అదే సమయంలో ఒక వీఐపీ వస్తే వారికి మాత్రం మర్యాదలు ఇచ్చారని, తమలాంటి సాధారణ భక్తులపై సిబ్బంది, అర్చకుల తీరు బాగా లేదని ఆరోపించారు. ఇకనైన భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించకుండా చర్యలు చేపట్టాలని ఆలయ ఈఓను కోరారు.

అనుమానితులకు సహకరించొద్దు



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: అనుమానితులకు ఆశ్రయం కల్పించి సహకరించొద్దని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం గొత్తికోయ గూడెంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించి ఇంటింటా తనిఖీ చేశారు. గూడెంలో నివసిస్తున్న కుటుంబ సభ్యులు వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గూడెంలోకి కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గూడెంలో తగదాలు పెట్టుకొవద్దని ఎమైన సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవాలని గొత్తికోయలకు సూచించారు.